క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పి.గన్నవరం: స్థానిక 33 కేవీ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతులు, రాజోలు–నగరం ఫీడర్ నుంచి పి.గన్నవరం సబ్ స్టేషన్ లైన్‌లో ట్రీ కటింగ్ పనులు నిర్వహిస్తున్న కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏఈ జీవీ ఆచార్యులు తెలిపారు. ఈ కారణంగా ఎల్.గన్నవరం, మొండెపులంక, పెదకందాలపాలెం, నాగుల్లంక, మానేపల్లి, చాకలిపాలెం, వాడ్రేవుపల్లి, కనకాయలంక తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

వైభవంగా వారాహీ అమ్మవారికి పూజలు

అంబాజీపేట: మాచవరంలో వేంచేసిన వారాహీ అమ్మవారి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గత నెల 26 నుంచి నిర్వహిస్తున్న వారాహీ నవరాత్ర మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. నవరాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని వారాహీ అమ్మవారి ఆలయ ప్రాంగణం వద్ద శనివారం అన్నసమారాధన చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

క్షయ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు

అంబాజీపేట: క్షయ వ్యాధిపై రోగులు నిర్లక్ష్యం వహించకుండా మెరుగైన వైద్య సేవలు తీసుకోవాలని సర్పంచ్ కోట బేబీరాణి అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ముక్కామల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చిరతపూడిలో వైద్యురాలు కె.సుమప్రియ అధ్యక్షతన క్షయ వ్యాధి లక్షణాలపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. కోనసీమ జిల్లా టీబీ వైద్యాధికారి ఎం.రామానుజరావు ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌టీఎల్‌ఎస్ సర్వారాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ రేష్మ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి



పినపళ్లలో అవార్డు గ్రహీత ఎంపీడీఓ రాజును సత్కరిస్తున్న గ్రామస్తులు

ఆలమూరు: పర్యావరణ పరిరక్షణకు వాతావరణ సమతుల్యతకు తమ వంతు కృషి చేసి గ్రామాలను హరిత వనాలను చేసేందుకు ఎల్లప్పుడు తమ సహకారం ఉంటుందని అబ్దుల్ కలాం మైనారిటీ సొసైటీ చైర్మన్ సూరజ్, ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. మండలంలోని పినపళ్లలో సర్పంచ్ సంగిత సుభాష్ ఆధ్వర్యంలో ఓఎన్జీసీ సమకూర్చిన మామిడి, నేరేడు, ఉసిరి, కొబ్బరి మొక్కలను నాటే కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. అలాగే అబ్దుల్ కలాం మైనారిటీ సొసైటీ సమకూర్చిన 150 లీటర్ల కెపాసిటీ కలిగిన డస్ట్‌బిన్లను గ్రామ ముఖ్యకూడళ్లలో ఏర్పాటు చేశారు. ఇటీవల నిర్వహించిన ప్రతిష్టాత్మక యోగా డేలో చక్కని ప్రతిభను కనబర్చి అవార్డును సాధించిన ఎంపీడీఓ రాజును గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. గ్రామాభివృద్ధికి సహకరించిన ఓఎన్జీసీ, అబ్దుల్ కలాం మైనారిటీ సొసైటీ ప్రతినిధులకు సర్పంచ్ సుభాష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఓఎన్జీసీ అధికారులు కె.శ్రీకృష్ణ, శివకుమార్, ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి, ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, ఉప సర్పంచ్ యనదమల రాణి పాల్గొన్నారు.

నైపుణ్యం కలిగిన వారికి మరింత శిక్షణ

మామిడికుదురు: నైపుణ్యం కలిగిన వారికి మరింత మెరుగైన శిక్షణ ఇస్తామని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. పాశర్లపూడి సత్రంలో జరుగుతున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎంతో శ్రద్ధగా కుట్టులో శిక్షణ పొందుతున్నారన్నారు. శిక్షణ పూర్తయిన వారిలో నైపుణ్యం కలిగిన వారికి మరింత మెరుగైన శిక్షణ ఇస్తామని చెప్పారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆయన ఉద్బోధించారు. మహిళలు కేవలం వంటింటికే పరిమితం కాకూడదన్నారు. తమ స్వశక్తిపై ఆధారపడి జీవించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. ఈ సేవలను ప్రతి మహిళ వినియోగించుకోవాలని శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో శిక్షకురాలు మహీ జాబీన్ పాల్గొన్నారు.

అలీ అస్గర్‌కు కన్నీటి నివాళి

మామిడికుదురు: త్యాగాలకు ప్రతీకైన మొహరంలో భాగంగా మామిడికుదురులో ఊయలతో పాటు గుమ్మటాన్ని ఊరేగించారు. పవిత్ర కర్బలా పుణ్యభూమిలో శత్రువుల బాణాలకు బలైన హజరత్ ఇమామ్ హుస్సేన్ తనయుడు అలీ అస్గర్‌కు ముస్లింలు ఘనంగా నివాళులర్పించారు. గురువారం రాత్రి ప్రారంభమైన కార్యక్రమాలు శుక్రవారం ఉదయం వరకు నిరంతరాయంగా జరిగాయి. దీనిలో భాగంగా మామిడికుదురులోని ఇమామ్ అలీ రంజా పంజాలో మజ్లిస్ జరిగింది. మజ్లిస్ అనంతరం పంజా నుంచి అలీ అస్గర్ ఊయలతో పాటు గుమ్మటాన్ని తీసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భారీ సంఖ్యలో హాజరైన భక్తులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి రంగా

- వాడవాడలా ఘనంగా వంగవీటి జయంతి
- రంగా విగ్రహానికి పలువురి నేతల నివాళులు

మలికిపురం: వంగవీటి రంగా ఆశయాలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే, రంగా తనయుడు వంగవీటి రాధ అన్నారు. మలికిపురంలో రంగా విగ్రహాన్ని ఆయన తనయుడు వంగవీటి రాధ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పేదల కోసం అండగా నిలిచి ప్రాణం పోగొట్టుకున్న నేత రంగా అని అన్నారు. అలాగే మలికిపురం ఎంపీడీవో కార్యాలయం రోడ్డులో స్వాతంత్ర్య సమర యోధుడు అల్లూరి విగ్రహాన్ని కూడా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వంగవీటికి నివాళులు

రావులపాలెం: మహనీయుడు వంగవీటి మోహన్ రంగా జయంతి సందర్భంగా శుక్రవారం గోపాలపురం సెంటర్‌లో ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే గోపాలపురం సెంటర్లోని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడికుదురు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా వంగవీటి మోహనరంగా గుర్తింపు పొందారని కంకిపాటి సూర్యారావు, ఆదిలక్ష్మి మెమోరియల్ ట్రస్టు వ్యవస్థాపకులు కంకిపాటి వెంకటేశ్వరరావు అన్నారు. రంగా జయంతిని శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పాశర్లపూడిలంక గ్రామాల్లో రంగా విగ్రహాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో తోరం భాస్కర్, జాలెం శ్రీనివాసరాజు, అప్పన శ్రీరామకృష్ణ, అడబాల తాతకాపు, కొమ్ముల జంగమయ్య తదితరులు పాల్గొన్నారు.



గోపాలపురంలో రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

హక్కుల కోసం పోరాడిన యోధుడు

సఖినేటిపల్లి: బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన యోధుడు వంగవీటి మోహనరంగా అని ఏపీ రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు అన్నారు. అంతర్వేదికరలో రంగా విగ్రహం వద్ద ఆయన జయంతి పురస్కరించుకుని పెదకాపు పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ పోతురాజు నరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.

రంగా సేవలు చిరస్మరణీయం

పి.గన్నవరం: దివంగత నేత, విజయవాడ మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా బడుగు, బలహీన వర్గాలకు అందించిన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస రావు అన్నారు. స్థానిక అక్విడెక్టు పార్కులో పార్టీ నాయకుడు యన్నాబత్తుల ఆనంద్ ఆధ్వర్యంలో రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి గన్నవరపు తదితర నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పార్టీ నాయకులు, తదితరుల ఆధ్వర్యంలో జరిగిన రంగా జయంతి కార్యక్రమంలో పలువురు నివాళులర్పించారు. అలాగే రంగా విగ్రహానికి మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, సర్పంచ్ బీర వెంగమాంబ తదితరులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం అక్విడెక్టు పార్కులో వంగవీటి మోహనరంగా విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు వాసంశెట్టి కుమార్, సాధనాల జేడీ తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరంలో రంగా విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు

రాజోలు: వంగవీటి రంగా జయంతిని తాటిపాక సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక రంగా రాధా మిత్ర మండలి ఆధ్వర్యంలో మోహన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే రాజోలు సెంటర్‌లో ఉన్న రంగా విగ్రహానికి, శివాలయం వద్ద ఉన్న రంగా విగ్రహానికి స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బి.సావరం గ్రామంలోని రంగా విగ్రహానికి స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సఖినేటిపల్లి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన రంగా అని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు అన్నారు. మోరిపోడులో స్థానిక యూత్ ఏర్పాటు చేసిన వంగా జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ముప్పర్తి త్రిమూర్తులు, గెడ్డం తులసీ భాస్కరరావు, గెడ్డం ఫిలిప్‌రాజు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపేట: పేదల కోసం పోరాడిన వంగవీటి మోహనరంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని వాడపాలెంలో రంగా విగ్రహానికి రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అవిడిలో ఎంపీటీసీ సభ్యుడు దూళి సూరిబాబు తదితరులు రంగా విగ్రహానికి నివాళులర్పించారు.



మలికిపురంలో రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వంగవీటి రాధ, ఎమ్మెల్యే దేవ

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వంగవీటి రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలమూరులో శ్రీకృష్ణదేవరాయ మండల కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు, రాజకీయనేతలు పాల్గొని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వరకూ ర్యాలీగా తరలి వెళ్లి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మండలంలోని పినపళ్ల, సంధిపూడి, మూలస్థాన అగ్రహారం, జొన్నాడ తదితర గ్రామాల్లో రంగా జయంతిని అభిమానులు ఘనంగా జరుపుకొన్నారు. మండలంలోని మడికిలో వంగవీటి గ్రహావిష్కరణ జరిగింది. స్థానిక బ్రాహ్మణరేవు సమీపంలో కూటమి నేతలు నెలకొల్పిన ఈ విగ్రహాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాసు ఆవిష్కరించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కొత్తపల్లి నగేష్, గారపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అంతర్వేదికరలో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పెదకాపు



ఆలమూరులో రంగా జయంతి సందర్భంగా రోగులకు పండ్లు, రొట్టెలు పంచుతున్న నాయకులు



తాటిపాక సెంటర్‌లో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



వాడపాలెంలో రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న పాలూరి, బాపిరాజు

విప్లవ వీరుడు 'అల్లూరి'



మలికిపురంలో అల్లూరి–వంగవీటి జయంతి సభలో భూపతిరాజును సన్మానించిన మాజీ మంత్రి గొల్లపల్లి



ఊబలంక మదర్‌థెరిసా ఆశ్రమంలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామ పెద్దలు, చిన్నారులు

- ఘనంగా జయంతి
- సీతారామరాజు చిత్రపటాలకు నివాళులు

రావులపాలెం/అంబాజీపేట/పి.గన్నవరం/మామిడికుదురు/సఖినేటిపల్లి/కొత్తపేట/మలికిపురం: విప్లవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని మండలంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బాలుర హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న అల్లూరి విగ్రహానికి కార్యదర్శి దుళ్ళ వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు, ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే ఊబలంక మదర్ థెరిసా ఆశ్రమంలో అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కె.పెదపూడిలో అల్లూరి జయంతి వేడుకలను నిర్వహించారు. సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పి.గన్నవరంలో విప్లవ వీరుడు అల్లూరి జయంతి సందర్భంగా స్థానిక అక్విడెక్టు పార్కులో ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి అల్లూరి అందించిన సేవలను కొనియాడారు. మామిడికుదురు మండలం అప్పనపల్లిలో అల్లూరి విగ్రహానికి, మగటపల్లిలో అల్లూరి చిత్రపటానికి బీజేపీ నేతలు, స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సఖినేటిపల్లి క్షత్రియ కల్యాణ మండపం ఆవరణలో అల్లూరి జయంతి పురస్కరించుకుని ఆయన విగ్రహం వద్ద బుజ్జిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అంతర్వేదిపాలెంలో బీజేపీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద జయంతి నిర్వహించారు. కొత్తపేటలో అల్లూరి జయంతి పురస్కరించుకుని మండలంలోని గంటి గ్రామంలో క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి వేడుకలు నిర్వహించారు. వాడపాలెంలో మండల బీజేపీ నాయకుడు పాలాటి మాధవస్వామి ఆధ్వర్యంలో అల్లూరి జయంతి నిర్వహించారు. పలివెలలో అల్లూరి విగ్రహానికి సీతారామరాజు జాతీయ సేవా సంస్థ వ్యవస్థాపకుడు దుళ్ల వెంకటేశ్వర్లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మలికిపురం పార్టీ కార్యాలయంలో అల్లూరి, వంగవీటి రంగా జయంతి వేడుకలను వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇరువురి చిత్రపటాలకు కోఆర్డినేటర్ గొల్లపల్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అడబాల బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సూర్యారావు మాట్లాడుతూ చిన్నతనంలోనే అల్లూరి నాడు తెల్లదొరల గుండెల్లో గుబులు పుట్టించి స్వాతంత్ర్యానికి బాటు వేశారని, అటువంటి నేత చిన్నతనంలోనే బ్రిటిష్ తూటాలకు బలయ్యారని అన్నారు. అలాగే పేదల అభ్యున్నతే లక్ష్యంగా వంగవీటి రంగా పని చేసి తక్కువ వయస్సులోనే హత్యకు గురై అసువులు బాశారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'కేతా' మరణంపై వైఎస్సార్ సీపీని లాగవద్దు

మలికిపురం: రాజోలు ఎంపీపీ కేతా శ్రీను మరణం విషయంలో వైఎస్సార్ సీపీని అనవసరంగా లాగవద్దని వైఎస్సార్ సీపీ నాయకుడు పాటి శివకుమార్ అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేతా మృతి విషయంలో టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీపై బురద జల్లుతున్నారని, టీడీపీ నాయకులు సోషల్‌మీడియా వేదికగా వైఎస్సార్ సీపీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. టీడీపీకి చెందిన శెట్టిబలిజ నాయకుల పేరుతో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజోలు ఎంపీపీ కేతా శ్రీను మరణం టీడీపీకే కాదు శెట్టిబలిజ సామాజిక వర్గానికే తీరని లోటన్నారు. అటువంటి వ్యక్తి మరణంపై అసత్య ప్రచారాలు చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు. కేతా శ్రీను మరణానికి, తమ పార్టీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. సమావేశంలో రాజోలు మండల పార్టీ అధ్యక్షుడు, సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీను, జిల్లా రైతు నాయకులు గుబ్బల రమేష్, నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గుబ్బల సత్యనారాయణ, రాజోలు ఎంపీటీసీ సభ్యురాలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, జిల్లా బీసీ నాయకులు చెల్లుబోయిన శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాటి శివకుమార్

సీఎం చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

కొత్తపేట: ప్రమాదవశాత్తూ మరణించిన ఒక దళితుడిని కుక్కతో పోల్చిన సీఎం చంద్రబాబునాయుడు బేషరతుగా క్షమాపణ చెప్పాలని జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో మరణించిన దళితుడు సింగయ్యను చంద్రబాబు కుక్కతో పోల్చడాన్ని నిరసిస్తూ రాష్ట్ర పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు రాజశేఖర్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ దళిత నాయకులు శుక్రవారం కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో అదనపు ఎస్సై ఎ.వెంకటేశ్వరరావుకు మెమొరాండం సమర్పించారు. డేవిడ్‌రాజు విలేకరులతో మాట్లాడుతూ సీఎం వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆయనకు దళితులపై నిజమైన ప్రేమ ఏమాత్రం లేదని కేవలం కపట ప్రేమేనన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం దళితులపై హత్యలు, అత్యాచారాలు, దాడులు నిత్యకృత్యంగా మారిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత కుటుంబంలో వ్యక్తి మరణిస్తే ప్రభుత్వం దానిని సానుభూతితో చూడాల్సిందిపోయి రాజకీయంగా వాడుకోవాలని చూడడం క్షమించరాని నేరమని, చంద్రబాబు, లోకేష్ కుట్రలను సింగయ్య భార్య ధైర్యంగా ప్రతిపక్ష నాయకుడు జగన్‌కు చెప్పడంతో ఖంగుతిన్న చంద్రబాబు, లోకేష్ దళితులను కుక్కలతో పోల్చడం సభ్య సమాజం, ముఖ్యంగా దళిత జాతి తీవ్రంగా పరిగణిస్తుందని హెచ్చరించారు. సమావేశంలో దళిత నాయకులు గంటి ఎంపీటీసీ సభ్యుడు ముళ్ల జనార్దనరావు, పార్టీ దళిత నాయకులు పల్లి దిలీప్‌కుమార్, మాగాపు చక్రవర్తి, రవి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో అదనపు ఎస్సైకు మెమొరాండం ఇస్తున్న డేవిడ్‌రాజు

విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారం

ఆలమూరు: జిల్లాలోని వివిధ గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్కర పరిష్కారానికి కృషి చేస్తానని ఏపీ ఈపీడీసీఎల్ అమలాపురం సూపరింటెండెంట్ ఇంజినీర్ బి రాజేశ్వరి తెలిపారు. ఆలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ట్రాన్స్‌కో ఏఈ డీఎం కే ప్రసాద్ అధ్యక్షతన నిర్వహిచిన ఈ కార్యక్రమానికి ఎస్ఈ రాజేశ్వరి పాల్గొని కక్షిదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. మండలంలోని పలు గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య, సిబ్బంది కొరత ఉందని ఆమెకు తెలియజేశారు. అలాగే గ్రామాల్లో అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని పెదపళ్లకు చెందిన ప్రజా ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న ఐరన్ పోల్స్ స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని కోరారు. ఎస్ఈ రాజేశ్వరి మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల నుంచి అందిన 27 సమస్యలను త్వరితగతిన పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు, మండపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్, లైన్ ఇన్‌స్పెక్టర్లు వాసంశెట్టి సత్యనారాయణ, కేవీవీ సుబ్రహ్మణ్య నాయుడు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా కూటమి దగా



తమ్మన శ్రీనివాసు

ఆలమూరు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏడాది పూర్తయినా అమలు చేయకుండా ప్రజలను దగా చేసిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ అన్నారు. కూటమి నేతలు మండలంలోని చెముడులంకలో శుక్రవారం ప్రారంభమైన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సంబంధించి రెండు రోజుల్లో జమ చేస్తామన్న ప్రభుత్వం రెండు నెలలు పూర్తవుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటి వరకూ అర్హులకు ఒక్క పింఛను కూడా మంజూరు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న సుపరిపాలన నేతల వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడానికే తప్ప ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని వైఎస్సార్ సీపీ నేత తమ్మన విమర్శలు గుప్పించారు.

'ప్రైవేట్ వ్యక్తులకు ప్రయోజనం' ఫిర్యాదుపై విచారణ

కొత్తపేట: ఆత్రేయపురంలో ఏ విధమైన అనుమతులు, పంచాయతీ ఆమోదం లేకుండా దాతల నిధులు పేరుతో పనులు చేసి, తరువాత ఒక ప్రైవేట్ వ్యక్తికి లబ్ధి చేకూర్చే చర్యలపై పాలకవర్గం చేసిన ఫిర్యాదు మేరకు శుక్రవారం అధికారులు విచారణ జరిపారు. గ్రామంలో ఆ పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ విస్తరణాధికారిపై సర్పంచ్ గడ్డం సుధ, ఉప సర్పంచ్ ముదునూరి విష్ణుమూర్తి రాజు, ఏడుగురు వార్డు సభ్యులు గత నెల 23 న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దానిపై శుక్రవారం ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ఎ.రాజు విచారణ జరిపారు. సర్పంచ్ సుధ ఫిర్యాదు అంశాలను విచారణాధికారికి వివరించారు. పంచాయతీ పరిధిలో తనకు గాని, పాలక మండలి సభ్యులకు గాని తెలపకుండా, పంచాయతీ ఆమోదం గాని లేకుండా సుమారు రూ.40 లక్షల పనులు చేశారని తెలిపారు. దానిపై పంచాయతీ కార్యదర్శిని, పంచాయతీ విస్తరణాధికారిని వివరణ కోరగా ఎవరో ఒక దాత తన సొంత నిధులతో పనులు చేయిస్తున్నారని నమ్మించారు. పనులన్నీ పూర్తయిన తరువాత పాలకమండలి సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పి ఒక అజెండాను తీసుకువచ్చారు. దానిలో దాత నిధులతో చేశారన్న పై పనులు పంచాయతీ ఆమోదం కోసం చేర్చారు. దానిపై తాము ప్రశ్నించగా దళిత మహిళ అని కూడా చూడకుండా ఘర్షణకు దిగి, ఏకవచనంతో నీకు చేతనైంది చేసుకో, అధికారం మా వైపు ఉంది అని పనులు చేసిన ప్రైవేట్ వ్యక్తి, పంచాయతీ విస్తరణాధికారి, కార్యదర్శి అవహేళన చేసి అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్, ఉప సర్పంచ్, పలువురు సభ్యులు అధికారులను కోరారు. సంబంధిత ఇద్దరు అధికారులను కూడా విచారించారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలో 20 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ కె.కాత్యాయని తెలిపారు. ఎక్సైజ్ దాడుల్లో భాగంగా రావులపాలెం మండలం ఈతకోటలో సారా తయారీకి సిద్ధం చేసిన సుమారు 100 లీటర్ల పులిసిన బెల్లం ఊటను ధ్వంసం చేసి, అదే గ్రామానికి చెందిన మానే శ్రీను వద్ద 20 లీటర్ల సారా, గ్యాస్ సిలిండర్‌ను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అనంతరం కొత్తపేట కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన జాషువా



రాజోలు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు గుర్రం జాషువా వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

నాలుగు లంక గ్రామాలకు రహదారి మార్గం కట్..!



బూరుగులంక రేవులో వరద ఉధృతికి కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి (ఫైల్)

పి.గన్నవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నదీపాయల్లో వరద ఉధృతి స్వల్పంగా పెరుగుతోంది. దీంతో పి.గన్నవరం మండలం బూరుగులంక రేవు వద్ద గతేడాది నాలుగు లంక గ్రామాల ప్రజల రాకపోకల కోసం వశిష్ట నదీపాయలో నిర్మించిన నిర్మించిన తాత్కాలిక రహదారి శుక్రవారం రాత్రి వరద నీటి ప్రవాహానికి కొట్టుకుపోయే అవకాశం ఉంది. ఉదయానికి అక్కడ సాధారణ పరిస్థితిలో ఉండగా, రాత్రి 10 గంటల సమయానికి గట్టుకు సమాంతరంగా వరద చేరుకుంది. మరో అడుగు ఎత్తున నీటి ప్రవాహం పెరిగితే రహదారి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. రాత్రికి గట్టు తెగిపోయే అవకాశం ఉందని వీఆర్వో కె.భగవాన్ తెలిపారు. తాము అక్కడే కాపలాగా ఉన్నట్టు తెలిపారు. ఈగట్టు కొట్టుకుపోతే ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి.

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ధర్నా

రాజోలు: ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో రాజోలు యూనియన్ నాయకులు శుక్రవారం రాజోలు బస్టాండ్ ఎదుట ధర్నా చేశారు. డిపో అధ్యక్షుడు ఎ.వెంకటరెడ్డి నాయుడు ఆధ్వర్యంలో ధర్నా, గేట్ సమావేశం నిర్వహించారు. ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. పదోన్నతులపై వెంటనే క్లియరెన్స్ ఇవ్వాలని, ఎలక్ట్రికల్ బస్సుల నిర్వహణ పూర్తిగా ఆర్టీసీకే అప్పగించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ మేరకు ఐఆర్ వెంటనే ప్రకటించాలని కోరారు. సిబ్బందికి పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. రీజనల్ ప్రచార కార్యదర్శి వైవీవీఎస్.ప్రసాద్, గ్యారేజీ కార్యదర్శి రావు, కె.హనుమంతరావు, కుమార్, కె.దివ్యశ్రీ, వి.సాయిలత, టీఎస్ వాసు, జి.సత్యప్రసాద్, ఎస్ఎన్ భూషణం, డీఎస్ఎస్ నారాయణ, జి.దుర్గారావు పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో శుక్రవారం పోలీసులు జరిపిన దాడుల్లో ఐదుగురు జూదరులను అరెస్ట్ చేశారు. ఆలమూరు పోలీసుల కథనం ప్రకారం గ్రామ శివార్లలో పేకాడుతున్న సమాచారంతో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం దాడులు నిర్వహించింది. ఈదాడుల్లో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2760 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఏఎస్సై సూర్యచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ శాఖ ఐటీ సలహాదారుడిగా నాగబాబు

పి.గన్నవరం: రాష్ట్ర అటవీ శాఖ ఐటీ సలహాదారుడిగా పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామానికి చెందిన పెనమరెడ్డి నాగబాబు శుక్రవారం అమరావతిలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాగబాబును పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం



మాచవరంలో మంచి నీటి కుళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

అంబాజీపేట: జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మాచవరం పంచాయతీ పరిధి కామయ్యకోడులో రూ.4.15 కోట్లతో నిర్మించిన సురక్షిత మంచినీటి కుళాయిలను సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన ఎమ్మెల్యే గ్రామ సచివాలయం–4 వద్ద శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పోతాయిలంకలో రూ.92.50 లక్షలు, కోటివారి వారి అగ్రహారంలో రూ.50 లక్షలు, నాగాబత్తులవారి పాలెంలో రూ.90 లక్షలు, అంబాజీపేటలో రూ.54.15 లక్షలు, మాచవరంలో రూ.86.50 లక్షలతో పైప్ లైన్లు నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జి.జయశ్రీ, ఎంపీటీసీ మట్టా పార్వతి, చిట్టూరి శ్రీనివాస్, మట్టపర్తి సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.